క్లుప్తంగా

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. కళాశాలలో ది ఇండియా సిమెంట్స్ వారు హెచ్ఆర్ కార్పొరేట్ హెడ్ సత్యజిత్ తిరుపతి, బెంగళూరు రీజనల్ మేనేజర్ బద్రి క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. క్యాంపస్ డ్రైవ్‌కు అనంతపురం , కర్నూలు జిల్లాల్లోని వివిధ కళాశాలల నుంచి 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాలలో పరీక్షలు నిర్వహించగా కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు రూ.3.40 లక్షలు వేతనంతో ఎల్‌పీఏ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.

ఏజీపీకి సత్కారం



ఏజీపీ భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది నామాల విజయభాస్కర్‌రెడ్డిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి గంగుల కుంట కేశవరెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అలీ, ప్రభాకర్‌రెడ్డి, మధు, వంశీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో జయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగరాజు

శింగనమల: మండలంలోని కల్లుమడి గ్రామంలో గొల్ల జయమ్మ దివ్యాంగురాలు. అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగరాజు శనివారం కర్నూలులోని ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు. ఈ పరిస్థితిలో పింఛన్ ఎంతో ఉపయోగపడుతుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ను పంపి పింఛన్ అందజేసినందుకు ఎంతో రుణపడి ఉంటామని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

యోగాతో ఆరోగ్యం

గుంతకల్లు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలని ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు సూచించారు. శనివారం తిలక్‌నగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో ఆయుష్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ తిప్పయ్య విద్యార్థులకు అవగాహన కల్పించి, రోజూ ఇంటి వద్ద అరగంటపాటు యోగా చేయాలని సూచించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా అచరించడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కాశీనాథ్, కౌన్సిలర్ ఆంజనేయులు, ఆయుష్ యూనాని మెడికల్ ఆఫీసర్ సాజిదా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి



విద్యార్థులకు షీల్డ్‌లు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ఎంవీఐ రాజాబాబు సూచించారు. శనివారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని వివేకనంద పార్కులో ఏ ఎస్ గోజు రియు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 6వ ఇంటర్ రాయలసీమ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఆయనతోపాటు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్. కరాటే అకాడమీ అల్ ఇండియా చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ ఎం.అల్తాఫ్‌బాషా, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్ఎన్ శ్రీనివాస్ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ ఇంచార్జ్ దినేష్, ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పండువలా ఇంటి పట్టాల పంపిణీ

సొంతింటి కల నెరవేరుతోంది



నా పేరు రమీజాబీ. నా భర్త అమీర్‌బాషా మెకానిక్‌గా పని చేస్తాడు. తాడిపత్రిలోని టైలర్స్ కాలనీ ఉంటున్నాం. ఇంత వరకూ బాడుగ ఇంట్లోనే కాలం వెళ్లదీస్తున్నాం. వచ్చే అరకొర ఆదాయంతో తాడిపత్రిలో స్థలం కొని ఇల్లు కట్టుకోలేని పరిస్థితి. సొంతింటి కళ నేరవేరుతుందని కలలో కూడా అనుకోలేదు. ఈ రోజు ఇంటి పట్టా, రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

ఆనందంగా ఉంది



నా పేరు గౌరీబాయ్, నా భర్త బాబునాయక్ మృతిచెందాడు. 13 ఏళ్లగా తాడిపత్రి లోని సీపీఐ కాలనీలో బాడుగ ఇంట్లో నివాసముంటున్నాను. కూలి పనులకు వెళ్లి బతుకుతున్నాను. ఇంత వరకు నాకు ఎలాంటి ఆస్తిలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ పథకాలు అందాయి. వాటితో పాటు ఈ రోజు ఇంటి పట్టా అందజేశారు. సీఎం జగనన్నకు రుణపడి వుంటాం. త్వరలోనే సొంత గూటికి చేరుకుంటున్నందుకు ఆనందంగా ఉంది.





తాడిపత్రిలో మహిళకు ఇంటి పట్టా, రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి , కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

- సీఎం జగన్‌కు అండగా నిలవండి
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్/పెద్దవడుగూరు: తాడిపత్రి, పెద్దవడుగూరులో పేదలకు ఇంటి పట్టాల పంపిణీ పండుగలా నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో వున్న పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై మహిళకుకు ఇంటి పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. దాదాపు 1000 మంది లబ్ధిదారులుండగా మొదటి విడుతలో 836 మందికి అందజేస్తున్నట్లు అయన తెలిపారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనకొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు, అమ్మ ఒడితో పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు, ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు జగనన్నతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీపీ సరస్వతి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, సీనియర్ నాయకుడు ఆలూరు రామేశ్వరెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్ ఆంజనేయప్రసాద్, ఈటీపీఆర్‌డీ జిలాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల భవిష్యత్తుకే గ్యారెంటీ లేదు.

టీడీపీ అధినేత చంద్రబాబు 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' అంటూ ప్రజలను మరోసారి మోసం చేయడానికి తెరలేపారని, ప్రజలు ఆయన మాయ మాటలు నమ్మ మోసపోవద్దని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం పెద్దవడుగూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ పత్రాలను అయన పంపిణీ చేశారు.. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండటానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పెద్దవడుగూరు మండలంలోని రైతులకు గత ప్రభుత్వం ఎప్పుడూ రెండు పంటలకు సాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్లుగా రైతులకు రెండు పంటలకు సరిపడ సాగు నీరు అందించామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రంగస్వామియాదవ్, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, మండల యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, గరుడశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, సుంకన్న, హరికృష్ణారెడ్డి, పలుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

'పల్స్ పోలియో' విజయవంతం చేయండి



తాడిపత్రి అర్బన్: జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు

సాక్షి నెట్‌వర్క్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యులు, అధికారులు సూచించారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదివారం నుంచి 5వ తేదీ వరకూ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఐదేళ్లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



రాయలచెరువులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: నిరంతరం పేద ప్రజల గురించి , వారి అభివృద్ధి గురించి ఆలో చిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని రాయలచెరువు గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాయకులు డీసీఎంఎస్ సభ్యులు జగదీస్ నాగేష్, జిలాన్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవ దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహ స్ర నామార్చన ప్రధాన అర్చకుడు రామాచార్యులు చేపట్టారు. స్వామి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఉంచి రాత్రి గ్రామోత్సవం ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. అలాగే కొండల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మాజీ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు, ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హోరాహోరీగా రాతి దూలం పోటీలు



కల్లూరులో రాతి దూలం లాగుతున్న ఎద్దులు

గుంతకల్లు రూరల్: వెంకటాంపల్లి కనుమల్లో వెలసిన పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన పోటీల ప్రకాశం జిల్లా గంగన్నపాలెం ఉమారెడ్డి శ్రీవల్లి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. అతడికి రూ.40 వేలు అందజేశారు. పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన శ్రీరాములుకు రూ.30 వేలు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం దేవభక్తుని శ్రీకాంత్ చౌదరికి రూ.20 వేల నగదును నిర్వాహకులు అందజేశారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు క్షేత్రపాల కొండలో వెలసిన సింగరప్ప తిరునాల సందర్భంగా గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆరుపళ్ల విభాగం ఎద్దులకు రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా వైఎస్సార్ జిల్లా దాసరపల్లి వీరన్నయాదవ్‌కు రూ.40వేలు, గుంటూరు జిల్లా కొండపాటురు లక్ష్మీచౌదరికి రూ.30 వేలు, నంద్యాల జిల్లా మాల్యం మహిమన్నకు రూ.25వేలు, నంద్యాల జిల్లా టంగుటూరు రమాదేవికి రూ.20 వేలు, వైఎస్సార్ జిల్లా దాసరపల్లి గోపాల్‌కూ రూ.15వేలు, నంద్యాల జిల్లా కోడూరు నాగమోహన్‌రెడ్డికి రూ.12వేలు, కర్నూలు జిల్లా అలంకొండ ముని రంగడు యాదవ్‌కు రూ.10వేలు, అనంతపురం జిల్లా మరుట్ల క్రిష్ణమూర్తికి రూ.8వేలు నగదు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు రామక్రిష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు న్యూ కేటగిరీ విభాగంలో..

కల్లూరులో సింగరప్ప తిరునాల్లో భాగంగా ఆదివారం న్యూ కేటగిరి ఎద్దులకు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ.800 ప్రవేశరుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు అందజే స్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90143 99414, 98661 49433 నంబర్లలో సంప్రదించాలన్నారు.


జాబ్‌మేళాలో 293 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా జాబ్‌మేళా ద్వారా అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన సుమారు 293 విద్యార్థులు సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మహా జాబ్‌మేళా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇలాంటి జాబ్‌మేళాలను అందరూ సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. సెవెన్ టెక్ సాఫ్ట్ సొల్యూషన్స్, బ్లూ ఓషియన్, నవత ట్రాన్స్‌పోర్ట్, హుండాయ్, అమెజాన్, అపోలో, బిగ్-సీ, హిల్స్, వినూత్న ఫర్టిలైజర్స్, ఎస్‌బీఐ లైఫ్, యంగ్ ఇండియాలకు చెందిన హెచ్ఆర్ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 293 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ కోఆర్డినేటర్ రవి శంకర్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామమూర్తి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం



మాట్లాడుతున్న కార్మిక నాయకుడు నరసయ్య

గుంతకల్లుటౌన్: ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లకు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సంబరాలు చేసుకున్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బాణా సంచా పేల్చారు. కార్మిక సంఘం కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషదాయకమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సి.రమేష్, మారుతి, జగ్గిలిరమేష్, కార్మిక నాయకులు జగదీష్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు జీతాలు పెంచడం హర్షణీయమని మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వీరభద్రస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు కృతజ్ఞతలు తెలపడంతోపాటు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలన్నా, పేదింటి బిడ్డ భవిష్యత్తుకు బంగారు బాటలు పడాలన్నా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో 'మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్యక్రమంపై నియోజకవర్గంలోని పార్టీ జేఏసీ కన్వీనర్లు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, పెత్తందారులకు జరుగుతున్న మహా సంగ్రామంలో పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి రాష్ట్రంలోని రాజకీయ తోడేళ్లన్నీ ఏకమవుతున్నాయన్నారు. జేఏసీ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలంతా గడప గడపకూ వెళ్లి సీఎం జగనన్న ఆయా కుటుంబాలకు చేసిన మంచిని వివరించి ఓటును అభ్యర్థించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజలను వంచించడానికి వస్తున్న టీడీపీ, జనసేన కూటమి, ఇతర నేతలు చేస్తున్న మోసాలు, కుట్రలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి సిద్ధమై వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప, పార్టీ నాయకులు మంజునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

శ్రీవివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రాచేపల్లి బీసీ వన్నప్ప ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక స్విస్ ఎంబీఏ కాలేజీలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. వన్నప్ప చిత్రపటానికి పూలు వేసి ఆయన నివాళులర్పించారు. కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన గుండె వైద్యనిపుణులు సుమారు 370 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే రక్తదానం చేసిన కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ మంజునాథ్, స్విస్ కాలేజీ కార్యదర్శి ఓంకారప్ప, కోశాధికారి గురురాజు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నార్పల: మండల కేంద్రంలోని తిక్కయ్య స్వామి దేవాలయం వద్ద కర్నూలు ఏపీ వైద్యశాల వైద్యులు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి , సర్పంచు మన్నీల సుప్రియ,ఉప సర్పంచు శ్రీరాములు, మాజీ సర్పంచు ఖాదర్‌వలీఖాన్, మార్కెట్ డైరెక్టర్ అమీర్, కోనంకి సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే గుర్తింపు

బుక్కరాయసముద్రం: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి రంగాల్లో రాణిస్తూ తగిన గుర్తింపు పొందుతారని ప్రముఖ రచయిత దత్తశర్మ సూచించారు. శనివారం మండలంలోని గుత్తి రోడ్డు సమీపాన ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రముఖ రచయిత దత్తశర్మ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ రామకుమార్, ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు ఖాదర్, శంకరాయ్య, ఆనంద జ్యోతి, వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థులకు సన్మానం

తాడిపత్రి అర్బన్: 36 గంటల్లో 750 కిలోమీటర్లు స్కేటింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఆవులతిప్పాయపల్లిలోని రమణ మహర్షి స్కూల్ విద్యార్థులను రోటరీ క్లబ్ సన్మానించింది. శనివారం పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో స్కేటింగ్‌లో రికార్డు సృష్టించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మహేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి పీవీ సుబ్రమణ్యం, విసి.మద్దిలేటి, బాలసుబ్రమణ్యం, అబ్దుల్ రహీ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల, ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

తాడిపత్రి అర్బన్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించే దూదేకుల, ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య శనివారం ఓ ప్రకటనలో కోరారు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నూర్బాషా కులస్తులు, పార్టీ శ్రేయోభిలాషులు సమ్మేళనంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డితో పాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నూర్‌బాషా సంఘం కార్పొరేషన్ చైర్మన్ ఓతూర్ రసూల్ తదితర నేతలు హాజరవుతారన్నారు.

విద్యతోనే అభివృద్ధి

పామిడి: విద్యతోనే అభివృద్ధిసాధ్యమని జెడ్పీటీసీ ఎల్.శోభారాణి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక సరస్వతీ విద్యామందిరం వారికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సునీల్‌రెడ్డి, జే శ్రీనివాసరావు, బీవీ రత్నమయ్య, చౌడయ్య, లక్ష్మణస్వామి , హెచ్‌ఎంలు శ్రీనివాసన్, మయూరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన ఖాజా మోదిన్(36) అనే యువకుడు శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. వివరాలు.. ఖాజా మోదిన్ పెట్రోల్ బంక్‌లో పంప్‌మెన్‌గా పని చేసేవాడు. శనివారం డ్యూటీకి వెళ్లడానికి సిద్ధం అవుతున్న సమయంలో ఛాతిలో విపరీతంగా నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి బలవన్మరణం

గార్లదిన్నె: కనంపల్లి క్రాస్ సమీపాన పొలంలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు శనివారం చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 70 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు శింగనమల సీఐ శ్రీధర్ 93460 10558, గార్లదిన్నె ఎస్ఐ 94407 96813 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని గుత్తిరోడ్డు సుంకలమ్మ ఆలయం వద్ద మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. వారి నుంచి రూ.30 వేలు నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కారు బోల్తా.. నూతన వధూవరులకు గాయాలు

గుత్తి: మండలంలోని కొత్తపేట బ్రిడ్జి వద్ద శనివారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నూతన వధూవరులు శివశంకర్, సుష్మితతో పాటు ఆదెమ్మ అనే వృద్ధురాలు గాయపడింది. వివరాలు.. అనంతపురానికి చెందిన శివశంకర్, డోన్ మండలం కమలపాడుకు చెందిన సుష్మితకు గత గురువారం అనంతపురంలో పెళ్లి జరిగింది. శనివారం రిసెప్షన్ కోసం అనంతపురం నుంచి కమలపాడుకు కారులో వధూవరులు బయలుదేరారు. మార్గమధ్యలోని కొత్తపేట బ్రిడ్జి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు అనంతపురం రెఫర్ చేశారు. ఎస్ఐ నబీర సూల్ కేసు దర్యాప్తు చేపట్టారు.

121 చీనీ చెట్ల నరికివేత

శింగనమల: పి.జలాలపురం రైతు గంగరాజు పొలంలో 121 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. గంగరాజు జూలాకాల్వ రెవెన్యూ పరిధిలోని 307 సర్వే నంబరులోని 2.74 ఎకరాల్లో 420 చీనీ మొక్కలు నాటారు. కాపునకు వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 121 చీనీ చెట్లను నరికివేసినట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ శనివారం తెలిపారు.